ప్రమాదభరితంగా మారిన ఖాళీ స్థలాలు

● విష సర్పాలు, దోమల బెడదతో ప్రజలు అవస్థలు
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ఖాళీ స్థలాలు ప్రమాదభరితంగా మారాయి. వాటిలో పిచ్చి మొక్కలు మొలచి విష సర్పాలకు, దోమలకు నిలయాలుగా మారాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుండటం...గుంటూరు, విజయవాడకు అతి దగ్గరగా ఉండటం, జిల్లాలో గుంటూరు తర్వాత అతి పెద్ద పట్టణంగా తెనాలి రూపు దిద్దు కోవటంతో ఇక్కడ నివశించేందుకు ప్రజలు ఎక్కువ ఆశక్తిని కనపర్చుతూ ఉంటారు. అంతేకాకుండా తెనాలి పట్టణంలో తాగునీటి కొరత ఉండదు. దీంతో పల్లెల్లో నివశించే వారు, ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చిన వారు తెనాలిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం తెనాలి పట్టణంలో 2.32లక్షలకు పైగా జనాభా ఉన్నరంటే తెనాలి ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో మనకు అర్థమతుంది. జనాభా పెరిగిన రీతిలోనే స్థిర నివాసాలు పెరుగుతున్నాయి.

నాలుగు వందలకు పైగా ఖాళీ స్థలాలు..

తెనాలి పట్టణంలో ఇళ్ల మధ్య సుమారు 400కు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయనేది అధికారుల అంచనా. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు, పురుగులకు, పందులకు నిలయంగా మారుతున్నాయి. అంతేకాకుండా స్థలాలు పల్లంలో ఉండటం వల్ల సమీపంలోని మురుగు నీరు, వర్షపు నీరు దానిలో చేరి దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు తరచు వాటిని బాగు చేయించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

గతంలో వేకెంట్ ల్యాండ్ యాప్‌తో చర్యలు

తెనాలి మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను బాగు చేయించేందుకు వేకెంట్ ల్యాండ్ అనే ప్రత్యేక యాప్‌ను గతంలో రూపొందించారు. దానిలో ఖాళీ స్థలాల వివరాలు నమోదు చేసి, వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి బాగు చేయించేవారు. యజమానుల ఆచూకీలేని స్థలాలను మున్సిపల్ సిబ్బందితో బాగు చేయించి దానికి అయిన ఖర్చును దానిలో నమోదు చేసేవారు. ఎప్పుడైన ఆస్థల యజమానులు భవన నిర్మాణ ప్లాన్‌కు వచ్చినప్పుడు వారి నుంచి స్థలం బాగు చేయించినందుకు అయిన ఖర్చును వసూలు చేసి, తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను ఇచ్చి ప్లాన్ ఇచ్చే వారు. ఇలా మూడు సంవత్సరాలు జరిగిన తర్వాత దాని ఊసే అధికారులు మరిచారు. ఇది ఇలా ఉంటే గతంలో అధికారులు నోటీసులు ఇచ్చిన స్పందించిన యజమానులకు బుద్ధి చెప్పేందుకు.. వారి స్థలాల్లో ఇది మున్సిపల్ స్థలం అనే బోర్డులు ఏర్పాటు చేశారు.



ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు



ఖాళీ స్థలాల్లో మున్సిపల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

యాజమానులకు నోటీసులు



తెనాలి పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కొద్ది రోజుల్లో ఆ పని ప్రారంభమవుతుంది. అలాగే పట్టణంలోని ప్రవేట్ స్థలాల వివరాలు సేకరిస్తున్నాం. వివరాలు వచ్చిన వెంటనే సంబంధిత స్థల యాజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని బాగు చేయించాలని సూచిస్తాం.

– బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



మొక్కలు నాటుతున్న లెఫ్టినెంట్ కల్నల్ మహేష్, విద్యార్థినులు

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దొహదపడతాయని 22వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జె. మహేష్ పేర్కొన్నారు. వన్ ట్రీ- వన్ క్యాండేట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్త పేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ప్రధాని మోదీ తన తల్లి పేరిట మొక్క నాటటం జరిగిందన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ మాట్లాడుతూ విద్యార్థులు నాటిన మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ జ్యోతి, హవల్దార్ రామ్‌రాజు, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లను ఉపయోగించుకోండి



ఆధార్ క్యాంపునకు వచ్చిన వారితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 15వ వార్డులోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, నెహ్రూనికేతన్ స్కూల్‌లలో స్పెషల్ ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మంగళవారం ఆయన అధార్ సెంటర్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అలాగే అధార్‌లోని మార్పులు, చేర్పులు, అప్‌డేట్ కోసం వచ్చిన వారితో మాట్లాడారు. విద్యార్థులందరు అధార్‌ను తప్పని సరిగా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మరో నాలుగు రోజులు క్యాంప్ జరుగుతుందని, విద్యార్థులు వీటి సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ అనూషా, పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

హారిక కుటుంబానికి పరామర్శ



హారిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాజకుమారి, ద్వారకా శ్రీను

తెనాలిరూరల్: అమెరికాలో ఈ నెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెనాలి ఐతా నగర్‌కు చెందిన జెట్టి హారిక కుటుంబ సభ్యులను మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ వైస్ చైర్మన్ గుర్రం ద్వారకా శ్రీను మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటన జరిగిన తీరును తెలుసు కున్నారు. హారిక కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలానే స్విమ్మింగ్‌పూల్‌లో పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఐతా నగర్‌కే చెందిన తాడిబోయిన రవితేజ కుటుంబ సభ్యులను రాజకుమారి, మాధవరావు దంపతులు పరామర్శించారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలి

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్

ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఏఎన్‌ఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరి యునిస్ మాట్లాడుతూ గ్రామాల్లో మధుమేహం ఉన్న వారికి, ధూమపానం చేసే వారిని, 60 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. అదే విధంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రతి ఇంటికీ ఆశా కార్యకర్త వెళ్లి సర్వే చేయాలన్నారు. అనుమానితుల వివరాలను ఏఎన్‌ఎంలకు తెలియజేయాలని చెప్పారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లలో ఎలాంటి అలసత్వాన్ని వహించవద్దని, ప్రతి యాంటినేటల్‌కు నాలుగు సార్లు పరీక్షలు చేయించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పీహెచ్‌ఎన్ నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

పారిశుద్ధ్య లోపం వల్లే వ్యాధుల తీవ్రత


సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోను పారిశుద్ధ్యం క్షీణించి డయోరియా, డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబలి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో నగర సీపీఐ పార్టీ సమితి సభ్యుల విస్తృత సమావేశం నగర కార్యవర్గ సభ్యురాలు గుండెబోయిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకి అనేకసార్లు మొరపెట్టుకున్నా ఫలితం కాన రాలేదని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పైన అపరిష్కృతంగా ఉన్న సమస్యల పైన దృష్టి పెట్టాలన్నారు. అందుకు స్థానికంగా ఉన్న పార్టీ శాఖలు కదలి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ ఉన్న ప్రతి ప్రాంతంలో ప్రజా సమస్యలు ఉత్పన్నమైన వాటి పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ ప్రభుత్వం అత్యంత ప్రమాదకరంగా మారిందని, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు జరుపుతూ దేశ సౌభ్రాతృత్వానికే ప్రమాదం వాటిల్లే విధానాలను అమలు జరుపుతున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా జరిగే పోరులో సీపీఐ నాయకులు, కార్యకర్తలు విరోచిత పాత్ర నిర్వహించాలన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు నగర సమగ్ర అభివృద్ధి కోసం నగరంలోని పార్టీ శాఖలన్నీ పోరాట కార్యక్రమాలకు సిద్ధం కావాలని, నగరంలోని శాఖలన్నీ క్రియాశీలంగా పనిచేయాలన్నారు.

సాగు పనుల్లో పత్తి రైతులు



తాడికొండ: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పత్తి రైతులు ఎరువుల యాజమాన్యం మొదలు పెట్టారు. ఈ ఏడాది పత్తి విస్తీర్ణం పెరగడంతోపాటు వర్షాలు సకాలంలో కురుస్తుంటంతో ఇప్పటి వరకు పంటకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏపుగా పెరుగుతోంది. 24 గంటలుగా వర్షం తగ్గుముఖం పట్టి వాతావరణం అనుకూలంగా మారడంతో రైతులు ఎరువులు చల్లే పనిలో నిమగ్నమయ్యారు.

క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



తెనాలి: పట్టణ అయితా నగర్‌కు చెందిన మైకా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ డాక్టర్ పాముల ఐజయ్య 60వ జయంతిని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.జాన్సన్ వాక్యోపదేశం చేశారు. దైవజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మైకా డైరెక్టర్ పాముల రవికుమారి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాముల రిచర్డ్, పాముల అనూష, పల్లె సామ్యేల్, ఎస్.సంసోన్, జె.భాగ్యరాజు, జి.జోసెఫ్ సునీత, ఆర్.రూతమ్మ, అక్కిదాసు కిరణ్‌కుమార్, కనపర్తి అనిల్ కుమార్, వై.సునీల్, వంపుగ్గల జోసఫ్, పాముల రూజ్‌వెల్ట్, ప్రసంగి పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీకి అభినందన



తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఆచార్య కంచర్ల గంగాధర్‌ను స్థానిక ఏఎస్ఎన్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనివర్శిటీలోని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కళాశాల తరపున అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా గంగాధర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. వీరితో ఏఎస్ఎన్ కాలేజి కామర్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాజీవ్ ఉన్నారు.

మురుగు పారుదలకు చర్యలు



తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 23, 29, 32 వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే మురుగు కాల్వను పరిశీలించారు. దానిలో ఏ మేరకు వ్యర్థాలు ఉన్నాయనే దానిని పరిశీలించారు. ప్రతిరోజు కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. అలాగే కాల్వలో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట ఏఈ రాజు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



గుంటూరు రూరల్: యువతి అదృశ్యంపై నల్లపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్జీవో కాలనీ, 12వ లైను నల్లకుంటకు చెందిన రేపూడి సుమ ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి రేపూడి ఎలీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. యువతికి 20 సంవత్సరాలు ఉంటాయని, మతి స్థిమితం లేదని ఆచూకి తెలిసిన వారు నల్లపాడు పోలీస్ స్టేషన్ 8688831376, 8688831590 సెల్ నంబర్లకు తెలియజేయవచ్చన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. కుంచనపల్లికి చెందిన కొండ సుబ్బారెడ్డి, సుబ్బమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కొండ శ్రీనివాసరెడ్డి ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. 20 సంవత్సరాలుగా మండల ప్రజాపరిషత్ పాఠశాలలో వీటి పంపిణీ ఏటా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మేరి సహాని మాట్లాడుతూ.. శ్రీనివాసరెడ్డి ఇలా సాయం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమర శివనాగేశ్వరరావు (నాగయ్య) కుంచనపల్లి అధ్యక్షులు మిరియాల రాంబాబు, యువజన నాయకులు దొంతిరెడ్డి తిరుమల రెడ్డి, గడ్డం తాతారావు (తాతయ్య), మాజీ సర్పంచ్ బిరుదుగడ్డ విజయేంద్రరావు, చాగంటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చైర్ అభివృద్ధికి కృషి

నూతన డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్



ఆచార్య పీజే రత్నాకర్‌ను సన్మానిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఏఎన్‌యూ: యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని నూతన డైరెక్టర్ ఆచార్య పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా నియమితులైన ఆయన గత కోఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు నుంచి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పూలే, అంబేడ్కర్ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య అశోక్ కుమార్‌లు నూతన డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య రత్నాకర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధనకు ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తానన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలు, లక్ష్యాలపై విస్తృతంగా పరిశోధనలు జరిపించడంతోపాటు, ఆయన జీవిత ఘట్టాలు, అణగారిన వర్గాలకు చేసిన సేవలను సమాజానికి చేరువ చేస్తానని తెలిపారు. ఢిల్లీలోని బాబూ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్‌ను సంప్రదించి అధ్యయన కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటేశ్వరరావు, పలువురు పరిశోధక, విద్యార్థి సంఘ నాయకులు, సిబ్బంది నూతన డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

ప్రాథమిక దశలోనే విద్యార్థులపై దృష్టి పెట్టాలి

ఎంఈవో సీహెచ్ రమాదేవి



విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: ప్రాథమిక పాఠశాల దశ నుంచే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో చదవడం, రాయడం నేర్పించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో సీహెచ్ రమాదేవి, ఎంఈవో-2 లీలారాణిలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా పరీక్షించారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం సాధించేలా ప్రైమరీ లెవల్ నుంచే ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీపడకుండా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డికి సూచించారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదు



ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి

కాకుమాను: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించాలని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండల కేంద్రం కాకుమానులో మంగళవారం ఎరువులు, విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లో దుకాణ యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే రైతులు స్థానిక వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. దుకాణాలలో ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో కె.కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.

ప్రతిభ చాటిన విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు



అర్హత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్ : ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. మంగళవారం పెదపలకలూరులోని కళాశాలలో లియోరా డిజిటల్ అమిగోస్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన విద్యా విధానం, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో తమ కళాశాల విద్యార్థులు ఉపాధి పొందగలుగుతున్నారన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి గోపాలకృష్ణ, ఇన్‌చార్జి రామిరెడ్డిలు మాట్లాడుతూ లియోగా డిజిటల్ అమిగోస్ సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం ప్రతిభ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను సంస్థ డైరెక్టర్ జె.బోయస్‌రాజు, ఆపరేషన్స్ మేనేజర్ షేక్ ఇమ్రాన్, పాలిశెట్టి శేషసాయి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

సైనికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

లక్ష్మీపురం: విద్యార్థులలో నైపుణ్యతను వెలికి తీసేందుకు ప్రధానంగా ఆర్మీ జవానుల కుటుంబాలలో పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందజేయడం జరిగిందని ఎన్‌సీసీ కల్నల్ సజల్ కాంతిదాస్ అన్నారు. స్థానిక శ్యామలానగర్ ఎన్‌సీసీ కార్యాలయంలో మంగళవారం స్కాలర్ షిప్‌ల పంపిణీ నిర్వహించారు. ఆర్మీ సైనికుల పిల్లల్లో నూతనోత్తేజం నింపేందుకు ఈ స్కాలర్ షిప్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. ఆదే విధంగా ఈ ఏడాది 142 మంది విద్యార్థులకు ఈ ప్రతిభ పురస్కారాలను అందచేసినట్లు ఆయన చెప్పారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన సైనికుల పిల్లలకు ప్రతి విద్యార్థికి రూ.5 వేలు అందజేశామని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రతిభ కనబర్చిన ప్రతి ఒక్కరికీ ప్రతిభా పురస్కారాలను అందజేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.

రాష్ట్రాభివృద్ధికి దోహద పడే బడ్జెట్

తెనాలిరూరల్: కేంద్ర బడ్జెట్ అన్ని విధాలుగా రాష్ట్రాభివృద్ధికి దోహదపడేలా ఉందని బీజేపీ నాయకులు అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని భారతీయ జనతా పార్టీ పట్టణ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వారు సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు మాట్లాడుతూ, రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం బడ్జెట్‌లో కేటాయించడం హర్షణీయమని అన్నారు. ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం అందిస్తామని ప్రకటించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివద్ధికి ప్రత్యేక సహకారం అందించడం, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని రోడ్డులకు ప్రత్యేక సాయం ప్రకటించడం వంటి ముఖ్యమైన అంశాలు బడ్జెట్‌లో కేటాయించారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు దారా సాయి గుప్తా, శిఖా రవీంద్రబాబు, దుద్దుకూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

ప్రత్తిపాడు: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటాయింపులు చెయ్యడం హర్షణీయమని బీజేపీ సీనియర్ నాయకుడు జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించటంపై జంధ్యాల హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించడంతో పాటు, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు నిధులతో పాటు వెనుకబడిన ఏడు జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించటాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

పొన్నూరు: బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెడుతోన్న బడ్జెట్‌లో గత పదేళ్లగా రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టేందుకు అంకెల గారడి చేస్తుందని పొన్నూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఇకనైనా బీజేపీ రాష్ట్రానికి మేలు చేసే దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్, 2014 నుంచి నేటి వరకు ఇది 11వ బడ్జెట్ అని, అన్ని బడ్జెట్‌లలో రాష్ట్రానికి బీజేపీ ఇచ్చింది శూన్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజషన్ యాక్ట్ ప్రకారం రాష్ట్రానికి రూ.15 లక్షల కోట్లు అవసరం ఉండగా అది నేడు రూ.20 లక్షల కోట్లకు చేరిందని, కేంద్రం ప్రకటించిన రూ.15 వేల కోట్లు ఏ మూలకు వస్తాయో వారే తెలపాలని ప్రశ్నించారు.

కలుపు మందు అమ్మకాలు నిలిపివేత



కొరిటిపాడు(గుంటూరు): సంగడిగుంటలోని లాంచ స్టర్ రోడ్‌లో గల పల్నాడు పార్శిల్ సర్వీసులో గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు బి.గౌతం ప్రసన్న, ఒ.సునీల్‌లు మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేకుండా హైదరాబాదు నుంచి వస్తున్న రూ24,000 విలువ గల 150 లీటర్ల గ్లైసెల్ పురుగు మందుల(కలుపు మందు)ను స్వాధీనం చేసుకుని అమ్మకాలు నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏఓలు మాట్లాడుతూ అనుమతులు లేకుండా విత్తనాలు, పురుగు మందులు రవాణా చేయడం నేరమన్నారు. సరైన పత్రాలు లేని కారణంగా స్వాధీనం చేసుకుని అమ్మకాలు నిలిపివేశామన్నారు. ఈ కలుపు మందుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.